ప్రజాశక్తి
సోమవారం 28 ఆగస్టు 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బస్ బే నిర్మాణాల్లో నాణ్యతెంత ?

- సెంట్రల్ పార్కు వద్ద ఘటనపై సర్వత్రా చర్చ
- సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

కూలిన బస్ బే వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, జనసేన కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని సెంట్రల్ పార్కుకు ఎదురుగా ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు దక్షిణ భాగంలో ప్రతిష్టాత్మంగా నిర్మించిన బస్ బే ప్రారంభం కాకుండానే కూలిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాలీ, వానా లేదు.. భారీ వర్షం కూడా లేదు.. అయినప్పటికీ ఉన్నట్టుండి అది కూలిపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన నూతన బస్ బేల నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ నగరం మరింత సుందరంగా కనబడడం కోసం సరికొత్త డిజైన్‌తో బస్ బేలను నిర్మిస్తున్నారు. అందులో భాగంగా రూ.40 లక్షలతో సెంట్రల్ పార్కు వద్ద నిర్మించిన బస్ బే మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కావాల్సి ఉండగా ఆదివారం ఉదయం సుమారు ఏడు గంటల ప్రాంతంలో కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో మార్నింగ్ వాక్ కోసం వచ్చిన వారు మాత్రం ఆ సంఘటనను చూసి ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు.

సిపిఎం, జనసేన, టిడిపి నిరసన

సెంట్రల్ పార్కు ఎదురుగా ఉన్న బస్ బే కూలిపోయిన సంఘటనను ఖండిస్తూ శనివారం అదే స్థలంలో సిపిఎం, జనసేన కార్పొరేటర్లు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి మాట్లాడారు. బాధ్యులైన అధికారులపైనా, కాంట్రాక్టర్‌పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు అదే చోట నిరసన తెలిపారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బస్ బే కూలిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వార్వా - నివాస్ ప్రధాన కార్యదర్శులు బిబి.గణేష్, మిగతా 2లో..

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు, అప్పలరాజు తదితరులు

సిపిఎం సమర భేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అనకాపల్లి : అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను పీడించుకు తింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి సమరభేరి పేరిట జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. సమరభేరిలో భాగంగా ఈ నెల 28న మిగతా 2లో..

29న గిడుగు రామ్మూర్తి జయంతి సభ

ప్రజాశక్తి - కలెక్టరేట్

తెలుగు వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సభను మంగళవారం సాయంత్రం 5 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి, అరసం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా మాధుర్యంపై ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు భాషా కోవిదులు మీగడ రామలింగస్వామి, మేడా మస్తాన్ రెడ్డి, కెజి.వేణు, అడపా రామకృష్ణ, అయ్యగారి సీతారత్నం, క్షేత్రపాల్ రెడ్డి, వేల్పురి నాగు, కెఎస్‌వి.రమణమ్మ, శేఖర్ మంత్రి ప్రభాకర్, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ కెవిఎస్.మూర్తి, జాలాది విజయ, ఎంవిఎస్.శర్మ, ధవళ రవికుమార్, తదితరులు పాల్గొంటారన్నారు.

ఆరోగ్యకర పంటలు అందించడమే లక్ష్యం

వార్త 2లో..

కెజిహెచ్‌లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

వార్త 2లో..

నాలుగున్నరేళ్లుగా నిర్లక్ష్యం..!

వార్త 6లో..

ట్రోఫీతో రాయలసీమ కింగ్స్ జట్టు సభ్యులు

ఎపిఎల్ 2 విజేత రాయలసీమ కింగ్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 విజేతగా రాయలసీమ కింగ్స్ జట్టు నిలిచింది. పిఎం.పాలెం సమీపంలో ఉన్న ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆ జట్టు కోస్టల్ రైడర్స్ జట్టును మట్టికరిపించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 18 ఓవర్లుకు కుదించారు. తొలుత టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కోస్టల్ రైడర్స్ జట్టు బ్యాట్స్‌మ్యాన్లు 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ బ్యాట్స్‌మ్యాన్లు 16.3 ఓవర్లులో 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి టైటిల్‌ను సొంతం మిగతా 2లో..

నిరాశాజనకంగా ఖరీఫ్

- రైతుకు కష్టకాలమే..
- సకాలంలో కురవని వర్షాలు
- 33 శాతమే వరి సాగు
- ముదురుతున్న ఆకు మడులు
- ఇప్పటికీ నిండని చెరువులు
- జలాశయాల్లో పెరగని నీటి నిల్వలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్ అత్యంత నిరాశజనకంగా వుంది. కష్టకాలం నుంచి రైతు గట్టెక్కే పరిస్థితి కనిపించడంలేదు. సాగునీటి వనరులు కల్పించడంలో ప్రభుత్వాలు చూపుతున్న అశ్రద్ధతో రైతు కరువు కాటకాలపాలవుతున్నాడు. ఖరీఫ్‌లో వరి సాగు గడువు చివరి దశకు వచ్చినా 33 శాతానికి మించి ఉడుపులు కాలేదు. జిల్లాలో గతేడాది సకాలంలో కురిసిన వర్షాలకు ఈ సమయానికి దాదాపు లక్ష ఎకరాల్లో వరి పంట సాగైంది. ఈ ఏడాది వరి సాగు సాధారణ విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాలకుగాను ఈ నెల 26 నాటికి 45,022 ఎకరాల్లో (33 శాతం) పంట నమోదైంది. వారం రోజులుగా కురిసిన వర్షాలకు ఎండిపోతున్న ఆకు మడులు నిలబడ్డాయి. ఈ వర్షాలు ఎక్కువ పడిన ప్రాంతాల్లో దమ్ములు జరుగుతున్నాయి. మరో పది రోజుల్లోపు ఉడుపులు కాకపోతే బతికిన ఆకు మడులు ఉడుపులకు పనికొచ్చే అవకాశంలేదు. ఆర్‌జెఎల్, ఇతర రకాల ఆకు వ్యవధిలోపు ఉడవకపోతే పంట దిగుబడులు గణనీయంగా పడిపోనున్నాయి. ఆకుపోసిన 50 రోజుల్లోపు ఆర్‌జెఎల్ రకం ఉడాలి. ఇతర రకాల వరిసాగు 35 రోజుల్లోపు పూర్తిచేయాలి. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు చూస్తే ఆకుమడుల కాలవ్యవధిలోపు ఉడుపులు జరిగే పరిస్థితి కానరావడంలేదు.

బుచ్చయ్యపేటలో ఆకు తీస్తున్న మహిళలు

జిల్లాలో ఈ నెల 26 నాటికి సగటు సాధారణ వర్షపాతం 451.3 మిల్లీమీటర్లు నమోదు కావాల్సివుండగా 385 మిల్లీమీటర్లు (-15 శాతం లోటు) కురిసింది. జిల్లాలోని 24 మండలాల్లో వర్షాలు సమమోతాదులో పడలేదు. జలాశయాల పరిధిలోవున్న ప్రాంతాలు, వ్యవసాయ బోర్లు వున్న చోట తప్ప ఇతర ప్రాంతాల్లో పెద్దగా ఉడుపులు జరగలేదు. 24 మండలాల్లో చీడికాడ మండలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకాగా, 13 మండలాల్లో సాధారణ వర్షం నమోదైంది. 10 మండలాల్లో వర్షపాతం లోటువుంది. సెప్టెంబరు మొదటి వారంలోగా ఉడుపులు పూర్తవ్వాలంటే పెద్ద మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బస్ బే నిర్మాణాల్లో నాణ్యతెంత ?

పిట్టా నారాయణ మూర్తి వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

అఖిలపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లతో విచారణ చేపట్టాలి

డాక్టర్ బి.గంగారావు డిమాండ్

సెంట్రల్ పార్క్ వద్ద బస్సు షెల్టర్ కూలిన ఘటనపై అఖిలపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లతో విచారణ చేపట్టాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బస్‌షెల్టర్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. జివిఎంసి కౌన్సిల్‌ను వైసిపి డమ్మీ చేసిందన్నారు. బ్యూటిఫికేషన్ పేర ప్రజా సొమ్మును దుర్వినియోగం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆదివారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో నిర్మించిన మోడ్రన్ బస్ బే కూలిపోయిందని, భారీ అవినీతి, తప్పుడు డిజైన్, కొరవడిన పర్యవేక్షణ వల్లనే ఇలా జరిగిందని తెలిపారు. నగరంలో మొత్తం 20 మోడ్రన్ బస్ బేలను సుమారు రూ.4.62 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారన్నారు. వాస్తవంగా రూ.5 లక్షలతో నిర్మాణమయ్యే బస్ బేకు రూ.25 నుంచి 70 లక్షల వరకూ వెచ్చించారని తెలిపారు. కౌన్సిల్‌లో చర్చించకుండా దొడ్డిదారిన ఆమోదించుకొని భారీ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ బస్ బేలన్నింటికీ కాంట్రాక్టర్ ఒకరేనని తెలిపారు. ఆయన కూడా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సిఫార్సు చేసిన వ్యక్తి అని, ఆయన కోసమే ఈ బస్ బేల నిర్మాణం చేపట్టినట్టు తెలుస్తోందని అన్నారు. బ్యూటిఫికేషన్ పేర జివిఎంసి కౌన్సిల్ ప్రజల సొమ్మును దుర్వినియోగపరచడం తగదన్నారు.

నిరాశాజనకంగా ఖరీఫ్

వర్షాలు పడాల్సివుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. అప్పటికీ ఉడుపులు పూర్తికాకపోతే స్వల్ప కాలిక పంట రైతులు వేసుకోవాల్సివుంటుందని సూచిస్తున్నారు. 4,530 ఎకరాలకు సరిపడా స్వల్ప కాలిక పంట విత్తనాలకు వ్యవసాయశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు.

జిల్లాలోని తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల్లో గతేడాది నిల్వవున్నంత నీరు ఈ ఏడాదిలేదు. పరివాహక ప్రాంతాల్లో వర్షాభావంతో జలాశయాల్లోకి నీరు పెద్దగా రావడంలేదు. దీంతో జలాశయాల పరిధిలోని చెరువుల్లోను నీరు లేదు. పొలాల్లో నీరు నిలబడేలా వర్షాల్లేవు. చెరువుల్లో నీరులేకపోవడంతో ఉడుపులు జరిగిన ప్రాంతాల్లో వర్షాలు ఎడపెడితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఎక్కువగా వుంది. భారీ వర్షాలు పడితేగానీ ప్రస్తుత కరువు పరిస్థితి నుంచి రైతులు గట్టెక్కే అవకాశం ఏ కోశానా కనిపించడంలేదు.

ఈ నెల 26 నాటికి జలాశయాల పరిస్థితి

జలాశయం	నీటినిల్వ సామర్థ్యం	ప్రస్తుతం	గతేడాది	
తాండవ	380.00	365.90	375.50	(అడుగుల్లో)
రైవాడ	114.00	108.80	112.18	(మీటర్లలో)
కోణాం	101.25	95.00	98.00	(మీటర్లలో)
వరహా	460.00	450.20	458.90	(అడుగుల్లో)
పెద్దేరు	137.00	133.70	136.10	(మీటర్లలో)

ఎపిఎల్ 2 విజేత రాయలసీమ కింగ్స్

చేసుకున్నారు. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్లు అంతగా రాణించకపోయినప్పటికీ మిడిల్ ఆర్డర్‌లో దిగిన బిఎస్.వినయ్ కుమార్ 23 బంతుల్లో 5 సిక్స్‌లు, 4 ఫోర్లతో 53 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అదేవిధంగా జెహెచ్.విహారి 29 బంతుల్లో 46 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ 52 బంతుల్లో 99 పరుగులు చేశారు. చివర్లో దిగిన పి.గిరినాథ్ రెడ్డి 17 బంతుల్లో 29 పరుగులు చేశాడు. విజేత జట్టుకు ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ భారత క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ట్రోఫీ అందజేశారు.

సిపిఎం సమర భేరిని జయప్రదం చేయండి

విద్యుత్ అమరవీరుల దినోత్సవం రోజున క్యాంపెయిన్ ప్రారంభించి సెప్టెంబర్ 4 వరకు జిల్లా అంతటా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు భవన్‌లో ఈ మేరకు వారు సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 29 నుంచి 31వ తేదీ వరకూ ప్రచారం, సంతకాల సేకరణ ఉంటాయన్నారు. సెప్టెంబరు 1న సచివాలయాల వద్ద ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలు సమర్పిస్తామని, 4న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ భారాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఇచ్చిన హామీని గాలికి వదిలేసి ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. ఇప్పుడు నెలవారీ పెంపుదలకు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం పుణ్యమాని రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200కి పెరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. యువతకు ఎక్కడా ఉద్యోగావకాశాలు దక్కలేదన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పన జీవోను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి పాల్పడటం దారుణమని విమర్శించారు. గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, కె.తెలయ్యబాబు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సింహాచలం - ఆర్‌కె బీచ్ మధ్య నడిచే 28 సర్వీస్ నెంబర్‌గల ఆర్‌టిసి బస్సు ఆదివారం సాయంత్రం విశాఖ ఆర్‌కె బీచ్ రోడ్డులోని గోకుల్ పార్క్ వద్ద బీభత్సం సృష్టించింది. బస్సు డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అదుపుతప్పిన బస్సు ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. దీంతో అక్కడి పర్యాటకులు భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఓ బైకు దెబ్బతింది.

ఆరోగ్యకర పంటలు అందించడమే లక్ష్యం

'ప్రజాశక్తి'తో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సిహెచ్.లచ్చన్న

ప్రజాశక్తి - అనకాపల్లి : రసాయనిక ఎరువులు వినియోగం వల్ల భూమి సారవంతం రానురానూ తగ్గుతోందని, ఇటువంటి తరుణంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించడం ద్వారా భూమి సారవంతం పెరగడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన పంటలు అందుబాటులోకి వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ సిహెచ్.లచ్చన్న తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అమలుతీరును 'ప్రజాశక్తి'కి ఆయన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం 2023 - 24 ప్రణాళిక ఏంటి ?

ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు, నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు పలు ప్రణాళికలు వేశాం. అందులో భాగంగా జిల్లాలో 43 వేల 892 మంది రైతులతో 38 వేల 70 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం.

ప్రస్తుతం ఎంత మంది రైతులు ఎన్ని వేల ఎకరాల్లో వేశారు ?

జిల్లాలో 42 వేల 155 మంది రైతులతో 34 వేల 196 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానం అమలు చేస్తున్నాం. రైతులతో 30 రకాల విత్తనాలను ప్రీ మూన్ డ్రై సోయింగ్ వెయ్యడం జరిగింది.

ఈ విధానంలో పంటల్లో తెగుళ్లు, పురుగులు నివారణ ఏ విధంగా సాధ్యం ?

జిల్లా వ్యాప్తంగా పంటల్లో తెగులు పురుగుల నివారణకు నేచురల్ ఫెస్ట్ మేనేజ్‌మెంట్ చేపడుతున్నాం. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 195 నేచురల్ ఫెస్ట్ మేనేజ్‌మెంట్ దుకాణాలు ఏర్పాటు చేశాం.

ఈ విధానంలో అధిక దిగుబడి ద్వారా ఆదాయం ఎలా పొందవచ్చు ?

ప్రధానంగా కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో బహుళ పంటల విధానం అమలు చేస్తాం. ప్రకృతి వ్యవసాయం రైతులే కాకుండా ఇతర రైతులు చేకూడా వేయించి అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఎ గ్రేడ్ ఎటిఎం విధానంలో 365 రోజులు భూమిపై పంటలు వేస్తాం. తద్వారా రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుంది.

భూమి రక్షణ ఏ విధంగా సాధ్యం ?

365 రోజులు పంటల విధానం వల్ల భూమి ఎల్లప్పుడూ తేమతో నిండి ఉంటుంది. దీని వల్ల భూమిలో ఖనిజాలు, లవణాలు ఎల్లప్పుడూ ఉండడంతో భూమి సారవంతంగా ఉంటుంది.

ఈ విధానంలో సిబ్బందిగా ఎవరు పని చేస్తారు ?

ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల నుంచి 35 మందిని ఎంపిక చేసి వారికి ప్రకృతి వ్యవసాయంపైనా, ఎటిఎం వంటి విధానాలపైనా శిక్షణ ఇచ్చాం. నాలుగు సంవత్సరాల శిక్షణ అనంతరం వారికి డిప్లమో, ఫీజు డిప్లమో పట్టాలు ఇవ్వనున్నాం.

కెజిహెచ్‌లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. హాస్పటల్‌లో వైద్యుల తీరు, అందిస్తున్న వైద్యంపై ఒక్కొక్కరి దగ్గరకూ వెళ్లి పలు ప్రశ్నలు వేసి ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్థో విభాగంలోని రోగులతో ఆమె మాట్లాడుతున్న సమయంలోనే టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర కూడా ఇటీవల బస్సు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను పరామర్శించేందుకు అదే విభాగానికి వచ్చారు. ఆ వార్డులో ఇద్దరూ కలిసి రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుభద్ర మీడియాతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో ప్రస్తుతం రోగులకు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. తాను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కెజిహెచ్ గురించి ముక్తకంఠంతో జెడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తిన సందర్భాలు చూశానని, ఆ తర్వాత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున సహకారంతో కెజిహెచ్‌లో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఎస్‌టి సెల్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామన్నారు.

రోగిని పరామర్శిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ముస్లిం విద్యార్థిపై విషం చిమ్మడం దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తర ప్రదేశ్‌లో ముస్లిం విద్యార్థిపై విషం చిమ్మిన టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, మహమ్మద్ షరీఫ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర ప్రదేశ్‌లో యోగి పాలనలో మైనార్టీలపై దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం బాలుడిని చెప్పుతో కొట్టాలంటూ ఒక టీచర్ విద్యార్థులను ప్రోత్సహించడం ఎంత వరకూ సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రజాతంత్ర, లౌకికవాదులు, ప్రతిపక్ష పార్టీల నేతలు వెంటనే స్పందించాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకునేలా చేయాలని కోరారు.

కొత్తవలస - అరకు లైన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ విశాఖపట్నం - అరకు సెక్షన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం సమీక్షించారు. చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్) కె.ధనుంజయరావుతో కలిసి అరకు - కొత్తవలస సెక్షన్ మధ్య భద్రతా తనిఖీలు చేపట్టారు. డబ్లింగ్ పనుల పురోగతిని, శివలింగపురం సమీపంలో నూతన టన్నెల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. టన్నెల్ నెంబరు 32, బ్రిడ్జ్ నెంబరు 242 జంక్షన్ వద్ద పెట్రోల్‌మ్యాన్ రామన్నతో డిఆర్‌ఎం సంభాషించారు. ఆయన అంకిత భావాన్ని అభినందించారు.

ఉపకార వేతనాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రస్తుతం స్కాలర్‌షిప్‌లు పొందే ప్రతిభగల విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకొని స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కాబోయే రోటరీ గవర్నర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జపాన్‌కు చెందిన ఎల్ -ఎంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ వారు రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి 30 మంది ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతరం చేతుల్లోనే ఉందన్నారు. రోటరీ విశాఖ వ్యాలీ అధ్యక్షులు పాండురంగారాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ -ఎంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్, పూర్వ రోటరీ ప్రెసిడెంట్ మండ జానకిరామ్, రోటరీ పూర్వ అధ్యక్షులు బాబ్జీ, ధర్మసాయి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి
కోర్టు : గాజువాక

I.A. 25 / 2021 in O.S. 369 / 2007

పిటీషన్: ముద్దు చినతల్లి ...పిటిషనర్/వాది

అండ్: ముద్దు సింహాచలం & ఇతరులు ...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

నోటీసు

టు:

రెస్పాండెంట్ నెం.8 : కర్రి చినతల్లి, భర్త లేటు సాధూరావు, తలారిపాలెం, అగనంపూడి, గాజువాక, విశాఖపట్నం.

పైనెంబరు పిటిషన్‌నందు పై తెలిపిన పిటిషనర్/వాది మీపై I.A. 25 / 2021 in O.S. 369 / 2007 అను కేసు వేయుచున్నారు. పై కేసులో మీరు రెస్పాండెంట్ నెంబర్-8 అయివున్నందున సదరు శ్రీకోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా తప్పించు కొని కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేసి యున్నారు. కావున పై పిటిషన్‌లో మీ యొక్క హాజరు నిమిత్తం తేది: 13-09-2023కి వాయిదా అయివున్నది. ఆ దినమున ఉదయం గం.10-30ని.లకు స్వయంగా గాని, లేదా వకీలుగారి ద్వారా గాని పై తెలిపిన శ్రీకోర్టులో హాజరై మీ ఆక్షేపణలను మనవి చేసుకొనవలెను. లేనియెడల పై పిటిషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీకోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

G.RAMESH NAIDU, Advocate,
Gopalapatnam Main Road, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE
III ADDL. JUNIOR CIVIL JUDGE
AT: VISAKHAPATNAM
O.S. 1355/2022

Between :
INDIAN BANK,
Seethammapeta Branch,
Visakhapatnam, Rep. by its
Branch Manager ...Plaintiff
And:
Upadhyula Phani Kumar ...Defendant

SUMMONS

To, **The Defendant:**
UPADHYULA PHANI KUMAR,
S/o. Not known, Hindu,
age not known but major,
R/at D.No.12-10-25,
Vedulavari Street, Anakapalli-531001
and also at C/o. B. Sreenubabu,
D.No. 22-73-26/4,
Near Town Hall Road,
Seetharamaswany Temple Street,
Visakhapatnam-530001

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **20-09-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **20-09-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

G. LAKSHMI RAMBABU,
S. VARALAKSHMI
Advocates, Visakhapatnam

గోస్తనీపై కాజ్‌వే నిర్మాణమెప్పుడో?

- శివారు గ్రామాల ప్రజల కష్టాలు తీరేదెన్నడు?
- ప్రమాదకర స్థితిలో నదిని దాటాల్సిందే..
- నది ఉధృతి సమయంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు..
- పంట పొలాలకు వెళ్లే రైతుల పాట్లు

ప్రజాశక్తి -తగరపువలస

భీమిలి మండలం తాటితూరు పంచాయతీ శివారు గ్రామాల ప్రజలకు, పద్మనాభం మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు వారి అవసరాలకు గోస్తనీ దాటి రావాల్సిందే. నదిలో ఉధృతి పెరిగే సమయంలో నది అవతల, ఇవతల ఉన్న వారు దాదాపు 15 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రాక పోకలు సాగిస్తున్న పరిస్థితి కొన్నేళ్లుగా నెలకొంది. తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు, నది అవతల ఉన్న పంట పొలాలకు వెళ్లే రైతులు, మచ్చవానిపాలెంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లకు వెళ్లే లబ్ధిదారులు నది దాటి వెళ్లాల్సిందే.

శంకుస్థాపన చేసి ఏడాది పైనే...

తాటితూరు నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస వరకు పంచాయతీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.2 కోట్లతో తారు రోడ్డు, కాజ్‌వే నిర్మాణానికి 2022 మార్చి 2వ తేదీన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. నేటికి ఏడాది పైబడినా సరే నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదల లేదు. ఇప్పటికైనా తారు రోడ్డు, కాజ్‌వే నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

తాటితూరు గ్రామానికి పడమర దిశలో గోస్తనీ ఉంది. సర్వే నంబర్ 128 గుండా ఈ నది ప్రవహిస్తుంది. ఈ నది అవతల ఉన్న గ్రామాల్లో సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. 350 ఎకరాల విస్తీర్ణం గల తాటితూరు పెద్ద చెరువు కింద పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాలతో పాటు భీమిలి మండలం తాటితూరు పంచాయతీ శివారు గ్రామాలైన వేములవారి కల్లాలు, గొంపవారి కల్లాలుకు చెందిన రైతులకు దాదాపు 1200 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇదంతా నీటి ఆధారం గల వ్యవసాయ భూమి.

జెడ్పీ హైస్కూల్‌కు ఆనుకుని ఉన్న గోస్తనీ నదికి ఆనుకొని ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు ఆపసోపాలు పడాల్సిందే. గోస్తనీ జీవ నది. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తేటప్పుడు, సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడేటప్పుడు, వరదలు, తుపాను సమయంలో తాటి పూడి రిజర్వాయర్ గేట్లు ఎత్తేటప్పుడు అనివార్యంగా గోస్తనీ నది ఉధృతి పెరుగుతుంది. ఆ సమయంలో రైతులు ఆటోల్లో, బైకులపై తగరపువలస, సంగివలస, మూడు అమ్మవార్ల గుడి పక్కన ఉన్న రోడ్డులో దాదాపు 10 నుంచి 15 కిలో మీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. రైతులే కాదు ఇతరత్రా అవసరాలకు అక్కడున్న ప్రజలకూ పాట్లు తప్పవు. నది దాటే సమయంలో మనుషులు, పశువులు నదిలో కొట్టుకుపోయిన సందర్భాలు గతంలో లేక పోలేదని గ్రామస్తులు అంటున్నారు.

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం...

గోస్తనీ అవతల వైపు ఉన్న పద్మనాభం మండలం సామయ్యవలస, మునివానిపాలెం, తాటితూరు పంచాయతీ శివారు గ్రామాలైన వేములవారి కల్లాలు, గొంపవారి కల్లాలుకు చెందిన పలువురు విద్యార్థులు సంగివలస, తగరపువలస మీదుగా సుమారు 15 కిలోమీటర్ల దూరంలో చుట్టూ తిరిగి తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వ్యయ ప్రయాసలకోర్చి వస్తున్న పరిస్థితి ఉంది. ఒక్కోసారి అతి కష్టం మీద, ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని నదీ ప్రవాహంలో విద్యార్థులు జెడ్పీ హైస్కూల్‌కు రావడం గగుర్పాటు కలిగిస్తోంది. ముఖ్యంగా నది దాటే సమయంలో విద్యార్థినుల అవస్థలు చెప్పనలవి కానివి.

గోస్తనీ నది దాటి తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు కూడా...

కాజ్‌వే లేకపోవడంతో జగనన్న ఇళ్ల లబ్ధిదారులు కూడా ఇబ్బందులు పడాల్సిందే. గోస్తనీ అవతల ఉన్న మచ్చవానిపాలెంలో తాటితూరు, టి.నగరపాలెం, తాళ్లవలస పంచాయతీలకు చెందిన 430 మంది లబ్ధిదారులు ఉన్నారు. నదిపై కాజ్‌వే నిర్మాణం చేపడితే విద్యార్థులు, రైతులు, ఇళ్ల లబ్ధిదారుల కష్టాలు తీరనున్నాయి.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందినట్లు సిఐ తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి కొమ్మాది కూడలి కార్పెంటర్ కాలనీకి చెందిన గారి ప్రసాద్ (28) కారు డ్రైవర్‌గా పని చేస్తూ తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పెద్దిపాలెం వద్ద ఒక శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొమ్మాది కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

కారు, లారీ ఢీ

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై కార్ షెడ్ కూడలి వద్ద ఆదివారం కారు, లారీ ఢీకొన్నాయి. మధురవాడ నుంచి విశాఖ వైపు వస్తున్న కారును అదే మార్గంలో వస్తున్న లారీ కార్ షెడ్ కూడలి వద్ద ఢీకొట్టింది. దీంతో కారు ఒక్కసారి డివైడర్ పైకి వెళ్లింది. ఎవరికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కె హోటల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక బోయి వీధికి చెందిన వాడమదుల సతీష్ (27) నగరంలోని ప్రముఖ హోటల్‌లో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని స్కూటీపై భీమిలి వస్తుండగా రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సలహా మేరకు ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎఎస్ఐ జి.సత్తిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో నాట్య తరంగిణి డ్యాన్స్ అకాడమీచే శాస్త్రీయ, జానపద నృత్యాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూషికవాహన, వినాయక విఘ్నేశ్వర, మహా గణపతిం, కృష్ణ మా ఇంటికి, అదివో అల్లదివో, ఇదిగో భద్రాద్రి, కొలువైతివా, శ్యామల మీనాక్షి, చంద్ర చూడ, దశావతారాలు, జయ గణేశాయ తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎస్.లీలావతి నృత్య దర్శకత్వం వహించగా విష్ణువర్ధన్‌రెడ్డి, శాన్వి, ఇశ్విత, రాణి, చంద్రణి, మాధురి, దేదీప్య, చందు, ఇందు, మేధా, హర్షిణి ప్రియ, భవ్య కళాకారులు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

టిటిడి పాలకమండలి సభ్యునిగా యానాదయ్య నియామకంపై హర్షం

ప్రజాశక్తి-ఆనందపురం : నాయీ బ్రాహ్మణుడు సిద్దవటం యానాదయ్యను టిటిడి పాలకమండలి సభ్యునిగా నియమించడం పట్ల ఆనందపురం నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం జగన్మోహన్‌రెడ్డి కల్పించారని సంఘం అధ్యక్షులు కనకరాజు తెలిపారు. ఈ అవకాశానిచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస, ఆనందపురం తదితర ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇంజినీర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆనందపురం 33/11కెవి లైన్ నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం సాయంత్రం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ యూనియన్ మినిస్టర్ భగవంత ఖుబ, మాజీ క్రికెటర్ కృష్ణమాచార్య శ్రీకాంత్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి భ్రమరాంబ, పర్యవేక్షకులు త్రిమూర్తులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

ప్రీఫైనల్ హిందీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- భీమునిపట్నం : దక్షిణ భారత హిందీ ప్రచార సభ (చెన్నై) ఉత్తర్వుల ప్రకారం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన ఆదివారం భీమిలిలో ప్రీ ఫైనల్ హిందీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రేమీ మండలి అధ్యక్షులు కెవిఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలెంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కొత్తగా తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన ఎంవివి.సత్యనారాయణ ముందుగా జోడుగుళ్లపాలెంలోని కొత్త అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు ప్రజలకు అందుతున్న తీరును, స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, విశాఖ నగరాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా రానున్న తరుణంలో విశాఖ నగరాన్ని భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో తూర్పు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి -తగరపువలస : అందరిపట్ల ఆప్యాయత, అనురాగాలు కనబరిచే ముద్దాడ బంగారయ్య మృతి ఈ ప్రాంతానికి, ఆ కుటుంబ సభ్యులకు తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. బంగారయ్య సంస్మరణ సభ ఆయన స్వగ్రామం ముద్దాడపేటలో ఆదివారం ఏర్పాటుచేశారు. ముందుగా ఆయన చిత్ర పటం వద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలు, కుటుంబ ఉన్నతికి అనునిత్యం చేసిన కృషి ఎంతో గొప్పదని స్థానికులు, కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో కనకల సన్యాసినాయుడు, సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు, నాయకులు చిల్ల అప్పారావు, పల్లా పెంటరాజు, నమ్మి నాయుడు, రీసు నరసింగరావు, పీతల రమణ తదితరులు పాల్గొన్నారు. భార్య అప్పయ్యమ్మ, కుమారులు, కోడళ్ళు, పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

బంగారయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు, కుటుంబీకులు

క్రీడల పట్ల ఆసక్తి ఉండాలి : ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి –గాజువాక : విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కల్చర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ విశాఖ సౌత్ ఆధ్వర్యాన ఆదివారం గాజువాక హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మాయిలకు కబడ్డీ, త్రోబాల్, అబ్బాయిలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, మనం ఉన్న ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తేవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. విశాఖ టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేయడానికి దోహదపడతాయన్నారు. చదువుతోపాటు ఆటలు కూడా ప్రతి మనిషికీ ఎంతో అవసరమన్నారు. కల్చర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, యాంత్రిక జీవనంలో చాలామంది క్రీడలపై ఆసక్తి చూపట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పల్లా చిన్నతల్లి, రోటరీ క్లబ్ విశాఖ సౌత్ అధ్యక్షులు ఉమామహేశ్వరరెడ్డి, అధ్యక్షులు చెక్కా సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.విజయప్రశాంతి, 64వ వార్డు వైసిపి ఇన్‌చార్జి ధర్మాలు శ్రీను పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగిరెడ్డి తదితరులు

ఎస్ఆర్.పురంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి–పెందుర్తి : వచ్చే నెల 2వ తేదీన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలోని ఎస్ఆర్.పురం గ్రామంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైఫ్ కేర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో 28 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం కాలనీ నుంచి రామాలయం వరకు జనసేన నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి పంచకర్ల రమేష్ బాబుకు భారీ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై జనసేన పోరాడుతోందన్నారు. పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ పుట్టినరోజున ఒక పండగ వాతావరణం నెలకొంటుందన్నారు.

నేడు వికలాంగుల ఉపకరణాలకు గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి –ఆనందపురం : విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించడానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం గుర్తింపు శిబిరం నిర్వహించనున్నామని ఎంపిడిఒ అడపా లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ సహకారంతో ఆలింకో సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉప కారణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాలు సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, అంధుల చేతికర్ర, కృత్రిమ అవయవాలు, వివిధ రకాల ఉపకరణాలు అందజేయడం కోసం అర్హులను గుర్తిస్తారని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 40 శాతం అంగవైకల్యం గల వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, రెండు ఫొటోలతో శిబిరానికి హాజరు కావాలని కోరారు. ఎంపిక చేసిన వారికి పరికరాలు ఎప్పుడు ఇచ్చేది నిర్వాహకులు తెలియజేస్తారని, వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ కోరారు.

ఎన్‌టిఆర్ ముఖచిత్రంతో రూ.100 నాణెంపై హర్షం

ప్రజాశక్తి–ఆనందపురం : పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు ముఖ చిత్రంతో రూ.100 నాణేన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆవిష్కరించడం హర్షణీయమని విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పివివి.ప్రసాదరావు పట్నాయక్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్టీఆర్ ముఖ చిత్రంతో ఈ నాణెం ముద్రణకు దగ్గుబాటి పురందేశ్వరి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ గొప్పతనాన్ని, కీర్తి ప్రతిష్టలను దేశమంతటా తెలిపే విధంగా కేంద్రపెద్దలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, మీసాల రాము నాయుడు, లెంక శ్రీరామ్, పొట్నూరు వెంకటకృష్ణా రావు, గోకాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి –మధురవాడ : చిన రుషికొండ సముద్ర ప్రాంతంలో రోటరీ క్లబ్, క్లబ్ ఆఫ్ గీతం ఆధ్వర్యాన ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టి విశాఖకు పర్యాటకంగా మంచిపేరు తీసుకురావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులతోపాటు జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి –తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలలో శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ఆధ్వర్యాన మోషన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ సహకారంతో పలువురు విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. 347 మందికి నేత్ర వైద్య పరీక్షలు జరపగా, 14 మందికి కళ్ళ జోళ్ల అవసరమని గుర్తించారు. సమితి జోనల్ కో–ఆర్డినేటర్ ఎంవి.సత్యసాయి కుమార్, వంశీకృష్ణ, టివిఆర్.బాబా, సి హెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైల్వే కార్మిక సంక్షేమ సంఘం వార్షికోత్సవం

రైల్వే కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి –మాధవధార : మాధవధార రైల్వే కార్మికుల సంక్షేమ సంఘం 40వ వార్షికోత్సవాన్ని మాధవధార భరద్వాజ కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ 40 ఏళ్ల పూర్తి చేసుకున్న సంఘ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైల్వే కార్మికుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పప్పల రామచంద్రరావు, అధ్యక్షులు వావిలపల్లి వెంకటరావు మాట్లాడుతూ, రైల్వే కార్మికుల సంక్షేమం కోసం ఈ సంఘాన్ని ప్రారంభించామని చెప్పారు. 40 ఏళ్ల కిందట చిన్న సంఘంగా ఏర్పడి నేడు అనేకమంది సభ్యులతో పెద్ద సంఘంగా అవతరించిందని తెలిపారు. సంఘం ద్వారా కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికుల కుటుంబ సభ్యులకు ఆర్థికంగా తోడ్పాటుతోపాటు భవిష్యత్తులో కార్మికుల అభ్యున్నతి కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు, రైల్వే టికెట్ కలెక్టర్ సనపల శ్రీకాంత్, సంఘం ఉపాధ్యక్షులు మూల అప్పారావు, పప్పల శ్రీహరి, కార్యదర్శి చింతాడ రామ్ కుమార్, సహాయ కార్యదర్శి వి.లక్ష్మణరావు, కోశాధికారి పైడి రాము, కమిటీ సభ్యులు సనపల సీతారామకృష్ణ, కొమ్మనాపల్లి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రైల్వే కార్మికులను ఘనంగా సన్మానించారు.

పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు వద్దు

ప్రజాశక్తి–సీతమ్మధార: జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలలు, వసతి గృహాలు, పునరావాస కేంద్రాల్లో కుల, మత ప్రస్తావనలు తెచ్చే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా బుకాయపల్లిలో అన్యమత ప్రచారంతో పాటు మరిన్ని జిల్లాల స్కూళ్లలో ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆధారాలతో కూడిన ఫిర్యాదులు కోకొల్లలుగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు అందుతుండడం విచారకరమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నీతి, న్యాయం, నైతిక విలువలు, సేవా తత్పరతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది తర్ఫీదునివ్వాలి తప్ప మత సంబంధిత అంశాలకు ప్రాధాన్యతనిచ్చి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్ సమస్యలపై సిఐ దృష్టి

ప్రజాశక్తి–సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో సమస్యలపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఐ విజయ్‌కుమార్ దృష్టిసారించారు. స్టేషన్ ముందు రోడ్డుపై వాహనాలను సిబ్బంది అడ్డదిడ్డంగా పెట్టేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఒక క్రమ పద్ధతిలో ఉంచాలని చెప్పారు. స్టేషన్ లోపల ఉన్న డ్రెయినేజీ పొంగి నీరు బయటకు వస్తుండటాన్ని గమనించారు. స్టేషన్‌లో బాత్రూమ్ లేకపోవడం పెద్ద సమస్యగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సిఐ చెప్పారు. ఆయనతోపాటు ఎస్ఐ గౌరి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.

డ్రెయినేజీ నుంచి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న సిఐ

చేనేతలకు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి –గాజువాక : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు సముచిత స్థానం కల్పించాలని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కోరారు. చేనేత సమస్యలపై గాజువాకలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూలుపై సబ్సిడీ ఇవ్వాలని, జిఎస్‌టి ఎత్తివేయాలని కోరారు. రాష్ట్రంలో చేనేతలకు ఒక్కరికీ కూడా ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బండారు ఆనందప్రసాద్, ఎపిసిఐ చైర్మన్ గంజి చిరంజీవి, ఎంపీ జివిఎల్.నరసింహారావు, ఎమ్మెల్సీ పోతల సునీత, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వావిలాల సరళాదేవి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ వీవర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఇనమాల శివరామ ప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పప్పు దుర్గారమేష్, రాపోలు జగన్, చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

విజేతలతో ముత్తంశెట్టి మహేష్, టోర్నమెంట్ నిర్వాహకులు

ప్రజాశక్తి –తగరపువలస : చిల్లపేట ఎస్ఎస్ఎంఎలెస్ యూత్ ఆధ్వర్యాన గత కొద్ది రోజులుగా చిల్లపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ఆదివారం బహుమతులు అందజేశారు. కాకాస అధ్యక్షులు జెవి.కైలాష్‌రెడ్డి, చిల్లపేట యూత్ సభ్యుల సహకారంతో డి.ధనుంజయ మణికంఠ 2వ వర్ధంతి సందర్భంగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి కింద రూ.25 వేలు మూలకుద్దు జట్టుకు, రెండో బహుమతిగా రూ.15 వేలు సిటీ నగర్ జట్టుకు, మూడో బహుమతిగా రూ.6వేలు పరదేశి పాలెం జట్టుకు, నాల్గో బహుమతిగా రూ.5 వేలు చిల్లపేట జట్టుకు ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి నియోజక వర్గ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు వైసిపి అధ్యక్షులు చిల్ల భాస్కరరెడ్డి, నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, ఎం.ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొల్లి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మండల పరిషత్ భవన పనులు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి :అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న మండల పరిషత్ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. భవనం పక్కనే తొలి విడతలో మంజూరైన రూ.55 లక్షలతో పార్కు నిర్మాణంలో భాగంగా ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో రూ.50 లక్షలతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా పార్కును తీర్చిదిద్దుతామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. మాజీ ఎంపిపి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, జెసిఎస్ మండల కన్వీనర్ కెవి రమణ, వాలేటి నాగరాజు, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 400 మందికి కంటి పరీక్షలు

15 మంది స్వచ్ఛందంగా రక్తదానం

కంటి వైద్యశిబిరంలో దొరస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం :బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 112వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మంది కంటి రోగులను నేత్ర వైద్యులు పరీక్షించారు. అలాగే బ్రాండ్‌లెగ్స్ , రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి 550 మంది రోగులురాగా, శంకర్‌ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది పరీక్షలు నిర్వహించి, 262 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. 97 మందికి మందులు పంపిణీ చేశారు. 52 మందికి క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు.. శిబిరానికి హాజరైన రోగులు, సహాయకులకు మజ్జిగ, భోజనం సదుపాయాన్ని బ్రాండిక్స్ సంస్థ కల్పించింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే లక్ష్యమన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మునగపాకలో మండల జనసేన పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో జనసేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రానున్న ఎన్నికలలో జనసేనను ప్రజలు ఆదరించాలని కోరారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, కార్యదర్శి కె.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్, సరోజిని, పైలా రామనాయుడు, బి రాందాస్, అప్పన్న దొర, అడ్డాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ పెంటకోట నరసింహారావు, అక్కల భాస్కరరావు ఆడారి ప్రసాద్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే డిమాండ్ల సాధన

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - యలమంచిలి : ఐక్యపోరాటంతోనే డిమాండ్లను సాధించుకోవచ్చని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం యలమంచిలి నూకాలమ్మ గుడి ప్రాంగణంలో సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆశ, అంగన్వాడీ వర్కర్లు, విఆర్ఎ, పంచాయతీ, మధ్యాహ్న భోజనం స్కీం వర్కర్లకు నెలకు రూ.26వేలు వేతనం చెల్లించాలని, .ఇఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, అచ్యుతాపురం మండల కార్యదర్శి కె.సోమునాయుడు, సంతోష్‌రాజు, నరసింహులు,కూర్మారావు, శశికళ, రత్నం, రమణమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల నాయకులు ఇ.నాయుడు బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సంస్కరించి, నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసిందన్నారు. నల్లసాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన రైతాంగం స్ఫూర్తితో దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల పరిరక్షణ, ఉద్యోగభద్రతకు సమిష్టి పోరాటం అవసరమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎర్ర దేవుడు, యూనియన్ నాయకులు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో మాట్లాడుతున్న సిఐటియు నేత

బిఆర్‌టి కాలనీలో గడపగడపకూ..

వృద్ధురాలి సమస్యలు వింటున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని పిసినికాడ శివారు బిఆర్‌టి కాలనీలో పూర్తిస్థాయిలో కాలువల నిర్మాణానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. ఆదివారం కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులకు మంజూరైన పథకాలను అందజేశారు. వ్యక్తిగత సమస్యలతోపాటు కాలనీలో డ్రైనేజీ సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తేగా, ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయిన వెంటనే, గ్రామంలో మిగతా కాలువలను నిర్మిస్తామని హామీ ఇచ్చారుజ రాంభద్రపురం కాలనీలో రూ.10.30 లక్షలతో నిర్మించిన రక్షితనీటి పథకాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయని, చాలా సమస్యలు పరిష్కారమయ్యా యన్నారు. గడపగడపలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేశామ న్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినందునే ఇపుడు ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీయే రాజమార్గం

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి : సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

ప్రజాశక్తి- అనకాపల్లి : లోక్‌అదాలత్‌లో ఎటువంటి సమస్యలైనా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు అన్నారు. ఆదివారం శ్రీగౌరీ గ్రంథాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ, గౌరీగ్రంథాలయం సంయుక్త నిర్వహణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక అన్నారు. అల్పాదాయ వర్గాల ప్రజలకు లోక్‌అదాలత్ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. న్యాయస్థానంలో లేదా వ్యాజ్యానికి ముందు దశలో పెండింగ్‌లో ఉన్న వివాదాలు, కేసులను సామరస్యంగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే, రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. వ్యయప్రయాసలు లేకుండా కక్షిదారులు తమ వివాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా సేవలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహనకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.విజయలక్ష్మి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్‌లు మాట్లాడుతూ సత్వర న్యాయానికి, న్యాయ సహాయానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ, మానవ హక్కులు, ప్రజారోగ్యం, మహిళ, గృహ హింస, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, అత్యాచార నిరోధక మొదలగు ప్రజా ప్రయోజన చట్టాలు, ప్రాథమిక హక్కులు, విధులు, ఎఫ్ఐఆర్., మనోవర్తి తదితర అంశాలపై వివరించారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ చొక్కాపు అప్పలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కష్టఅప్పారావు, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తులను శ్రీగౌరీ గ్రంథాలయం సత్కరించింది.

బార్క్ నిర్వాసితులకు న్యాయం చేయాలి : సిపిఎం

బార్క్ భూములను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బార్క్ నిర్మాణంలో భూములు కోల్పోయిన తంతడి, వాడపాలెం, రాజన్నపాలెం, దోసూరు, చిప్పాడ గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు ఆర్ రాము, కె సోమినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం బార్క్ నిర్మాణానికి సేకరించిన భూములను సందర్శించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బార్క్ నిర్మాణంలో భాగంగా 238, 141 సర్వే నెంబర్లలో 600 మంది నిర్వాసితుల పేర్లన నమోదు చేసిన అధికారులు, ఇపుడు 130 మందికు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడం అన్యాయమనానరు. బార్కు నిర్వాసితులందరినీ గుర్తించి ప్యాకేజీతోపాటు, నష్టపోయిన భూములు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం, కోల్పోయిన ఆస్తులకు భూసేకరణ చట్టం ప్రకారం న్యాయ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు అన్యాయం చేస్తే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు.

ముగింపు దశకు 'గడప గడపకు' పనులు

8వ వార్డులో చేస్తున్న సిసి కాలువ పనులు

ప్రజాశక్తి - యలమంచిలి : గడపగడపకు మన ప్రభుత్వం కింద మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో చేపట్టిన సిసి రోడ్డు, డ్రైనేజీ పనులు దాదాపు పూర్తయ్యాయని మున్సిపల్ అధికార్లు తెలిపారు. ఆదివారం పని ప్రదేశంలో వివరాలను విలేకర్లకు తెలిపారు.. మున్సిపాలిటీలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో నాలుగు వార్డుల్లో ప్రజల అభ్యర్థన మేరకు పనులు గుర్తించి రూ.11 లక్షలు మంజూరు చేశారన్నారు. గతనెల 31న కౌన్సిల్ సమావేశంలో వీటికి ఆమోదం తెలపగా యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. 8వ వార్డుకు రూ.3 లక్షలు, 19 వ వార్డుకు రూ.2 లక్షలు, 21వ వార్డుకు రూ.5 లక్షలు, 22వ వార్డుకు రూ. ఒక లక్షతోం పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి :ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని గనులు శాఖ ఎడి సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం బవులువాడ పంచాయతీ సాయి వెంగమాంబ స్టోన్‌క్రషర్ ఆవరణలో యజమాని ఆదిశేషయ్య, అమిత్ కుమార్‌లతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్రషర్ సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటుతున్న మైన్స్ ఎడి సుబ్బారాయుడు

గొడుగుల పంపిణీ

గొడుగులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి శివకిరణ్

ప్రజాశక్తి-అనకాపల్లి : ధ్యానంతో ఆరోగ్యకరమైన ప్రశాంత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం శివకిరణ్ అన్నారు. ఆదివారం రామచంద్ర హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో 600 మంది సభ్యులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ చిట్టిబాబు, రాంబిల్లి డిటి శేషుబాబు, సంస్థ సభ్యులు డాక్టర్ కెవికె రావు, కోలపర్తి జయబాబు, సెంటర్ కోఆర్డినేటర్ జి మంగయ్య, అభ్యాసకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన టైలరింగ్ శిక్షణ

టైలరింగ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జన శిక్షణ సంస్థాన్ సహకారంతో గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసాయి. శిక్షణ పొందిన మహిళలకు న్యాయమూర్తులు జి.గంగరాజు, బివి.విజయలక్ష్మి, ఎం.శివకిరణ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ డైరక్టర్ చొక్కాపు అప్పలనాయుడు, గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, టైలరింగ్ శిక్షకురాలు రాపేటి ప్రేమలత పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలోని జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ వార్షికోత్సవంలో భాగంగా మూడవరోజు ఆదివారం స్థానిక విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్, ఖోఖో వంటి పలు రకాల ఆటల పోటీలు ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రామజోగి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, సంఘ అధ్యక్షులు కాండ్రేగుల నూకరాజు, టిడిపి నాయకులు మళ్ల వరాహనరసింగరావు , కొణతాల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పిల్ల జగదీష్, మళ్ల కనుమ నాయుడు, మొల్లేటి రవి, కాండ్రేగుల శ్రీనివాస్, పెతకం శెట్టి నాయుడు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి- చోడవరం : స్థానిక స్వయంభు విఘ్నేశ్వర ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదివారం అంకురార్పణ చేశారు. రాటం వేసి చవితి పనులు ప్రారంభించారు. నవరాత్రుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పప్పల జయదేవ్ తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు,, ఎంపిపి గాడి కాసు, ఇఒ సత్యనారాయణ, ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి చలపతి, నాయకులు వద్దాది నరసింహమూర్తి పంతులు, ఆలయ కమిటీ ఛైర్మన్ ఉప్పల సతీష్, వేచలపు ప్రకాష్, దొడ్డి వెంకట రావు, జ్యోతుల రమేష్, ఒరుగంటి నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఉత్సవ రాట వేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బాబోయ్ కుక్కలు!

- యలమంచిలిలో గుంపులుగా హల్‌చల్
- నాలుగు నెలల్లో 332 మందికి కుక్కకాటు

రామనగర్ వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కల గుంపు

ప్రజాశక్తి -యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువైంది. పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రామనగర్, రామాలయం వీధి, తులసీనగర్, గాంధీనగర్ మొదలైన ప్రాంతాల్లో అవి వీరవిహారం చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్దులు కనబడితే వారిని వెంటబడి, గాయపరుస్తున్నాయి. ఆ ప్రాంతానికి వచ్చిన కొత్తవారిని వెంటతరిమి మరీ కరుస్తున్నాయి.

కుక్క కాటుకు గురౌతున్న వారి వివరాల కోసం ఏరియా ఆసుపత్రిని సంప్రదించగా గత నాలుగు నెలల్లో 332 మంది బాధితులుగా తేలింది. ఏప్రిల్‌లో 100 మంది, మే నెలలో 82 మంది, జూన్ నెలలో 67 , జులై నెలలో 83 మంది కుక్క కాటుకు గురైనట్లు ప్రభుత్వ ఆసుపత్రి లెక్కలు చెబుతున్నాయి. కుక్కల బెడద నివారించాలని మున్సిపాలిటీకి ఎన్నిసార్లు నివేదించినా ఫలితం లేదని బాధితులు చెబుతున్నారు. కుక్కల నియంత్రణకు ప్రతి ఏటా ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోతుందని ఇంకొందరు కౌన్సిలర్లు వాపోతున్నారు. పట్టిన కుక్కల్ని పరిసరాల్లోనే వదిలేస్తుండడంతో అవి తిరిగి పాత స్థలాలకే చేరుతుండడంతో సమస్య పునరావృతం అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఊరకుక్కలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నా వాటిని నియంత్రించే చర్యలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా అవి నిరుపయోగం అవుతున్నా యంటున్నారు. యలమంచిలి ప్రాంతంలో కుక్కల నియంత్రణ ఆపరేషన్లకు ఇంత వరకు ఒక్క పైసా కూడా నిధులు కేటాయించలేదని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. సమస్య చిన్నదిగా భావిస్తున్నా అనుభవించే వారికి అది భయంకరంగా ఉంటుంటున్నారు. కొన్ని కుక్కలు బైక్‌పై వెళ్లే వారి వెంటబడి తరుముతూ ప్రమాదాలకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కుక్కల్ని నివారించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపైనే ఉందని ప్రజలు భావిస్తున్నారు.

లేగ దూడలను కరుస్తున్నాయి

మా ఇళ్ల దగ్గరే పశువుల కమేశా ఉంది. ఆదివారం, మంగళవారాల్లో ఇక్కడ అధికంగా పశు వధ జరుగుతుంది. ఆ సమయంలో పశువుల కళేబరాల కోసం కుక్కలు ఎగబడుతుంటాయి. వాటి మాంసానికి అవి బాగా అలవాటు పడ్డాయి. అప్పుడప్పుడు అవి మా పశువుల పాకల్లోకి దూరి లేగదూడల్ని గాయపరుస్తున్నాయి. ఈ మధ్య అవి మరీ ఎక్కువై పోయాయి.

- పైడయ్య , రైతు, ఎన్‌టిఆర్ కాలనీ, యలమంచిలి

కుక్కల బెడద నుండి కాపాడండి

బయట ఊళ్లకెళ్లి వస్తున్నప్పుడు కాస్త చీకటిపడి ఆలస్యమైతే కుక్కలు వెంటబడి తరుముతున్నాయి. చిన్న పిల్లలు, వృద్దులు ఒంటరిగా దొరికితే కలబడి గాయ పరుస్తున్నాయి. కుక్కల బెడద నుంచి ప్రజల్ని కాపాడాలి.

- గంగాధర్, మిలట్రీ కాలనీ, యలమంచిలి.

నియంత్రణ చర్యలు చేపడతాం

కుక్కల్ని ఎప్పటికప్పుడు నియంత్రించే బాధ్యత మున్సిపాలిటీపై ఉంది. ఏ ప్రాంతంలో కుక్కల బెడద ఉందో తెలియజేస్తే అక్కడ నియంత్రణ చేపడతాం. ఇక్కడ పట్టించిన కుక్కల్ని వేరే సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నాం. అవి తిరిగి వచ్చే ప్రసక్తి లేదు.

- వీరయ్య, మున్సిపల్ కమిషనర్

వీధి కుక్కల స్వైర విహారం

బుచ్చయ్యపేట : మండలంలోని దిబిడి, నేతవానిపాలెం, బుచ్చయ్యపేట గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. కొద్దిరోజులుగా 10 నుండి 15 కుక్కల గుంపులుగా ఏర్పడి గ్రామాల్లో భయాందోళన సృష్టిస్తున్నాయి. రాత్రి సమయంలో గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా నడిచి వచ్చే వాళ్లపై దాడులు చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం గ్రామాల్లో పలువురిని గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. చికెన్ షాపుల వద్ద వ్యర్థాలను తింటున్న ఈ కుక్కలు, గ్రామాల్లో రైతుల పెంచుకునే కోళ్లు, గొర్రెలు, మేకలు, ఆవు దూడలపై దాడులు చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో చిన్నారులపైనా దాడులు చేసి తీవ్రంగా గాయపర్చుతున్నాయి. దీంతో వీధి కుక్కలను చూసి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యం

పార్టీ జిల్లా నూతన కమిటీ నియామకంలో మంత్రి అమర్

ఎన్నికైన వైసిపి జిల్లా నూతన కమిటీ

ప్రజాశక్తి- అనకాపల్లి : వచ్చే ఎన్నికల్లో వైసిపిని మళ్లీ అధికారంలోకి తేవాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో 55మందితో వైసిపి జిల్లా నూతన కార్యవర్గ నియామకం జరిగింది. కొత్త కమిటీ ప్రతినిధులను మంత్రి అమర్‌తోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు నూతనకార్యవర్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైసిపి నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత కొత్త కమిటీపై ఉందన్నారు. కార్యకర్తలు నాయకులు మధ్య విభేదాలుంటే వాటిని పక్కనపెట్టి, పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎపిఐడబ్ల్యుసి రాష్ట్ర చైర్మన్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం

నూతన కమిటీల నియామకం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీ నియామకాలు ఆదివారం స్థానిక హోటల్‌లో నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకులు మొల్లి రమణబాబు ఆధ్వర్యంలో గౌరవ సలహాదారులుగా సిహెచ్ మహేష్, అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా లొడగల శ్రీదేవి, యూత్ కమిటీ సభ్యునిగా మాసవరపు అప్పారావు, బండారు శ్రావణ్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అనుపమ, విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎలమంచిలి ప్రసాద్, పెందుర్తి నియోజకవర్గం అధ్యక్షులుగా ఇసురపు వెంకటరావులను నియమించారు. కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, బిజెపి నేత కొణతాల అప్పలరాజు, సంఘం కార్యదర్శి శంకర్, కె ఉమామహేశ్వరి, మాసవరపు వెంకయ్య నాయుడు, పోలమరశెట్టి రామకృష్ణ, సన్నాడ జగ్గప్పారావ్, సింహ శ్రీను, నాగులపల్లి వెంకటేష్, నాగరాజు, శేఖర్, కుమార్, ఎలమంచిలి ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లుగా నిర్లక్ష్యం!

- ప్రారంభానికి బాలికల హాస్టల్ భవనం ఎదురుచూపులు
- అవస్థలు పడుతున్న విద్యార్థినులు.. పట్టని అధికారులు
- వడ్డాదిలో ప్రారంభానికి ముందే శిథిలమౌతున్న భవనం

ప్రారంభానికి నోచుకోని బాలిక హాస్టల్ భవనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బాలిక విద్యను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వ హయాంలో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో వడ్డాది జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన బాలికల వసతిగృహం నిర్మాణం పూర్తయి నాలుగున్నరేళ్ళ కావస్తున్నా నేటికీ ప్రారంభం కాలేదు. ఆర్ఎంఎస్ఎ ధులతో రూ 1.94కోట్లతో నిర్మించిన బాలికల హాస్టల్ 2019 నాటికి పూర్తయింది. ఈ హాస్టల్‌లో 8, 9,10, తరగతులతో పాటు ఇంటర్మీడియట్ తరగతుల బాలికలకు వసతి కల్పించాల్సి బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలు మంచి ఫలితాలను ఇస్తూ బాలిక విద్యకు ప్రాధాన్యతనిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు చదువు అంతంతమాత్రంగా ఉండే పరిస్థితుల్లో కెజిబివిలో సీటు దొరకని బాలికలు, ఈ హాస్టల్‌లోఉంటూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు

ఇటువంటి పరిస్థితుల్లో హాస్టల్ సౌకర్యం లేక బాలికలు ఒకవైపు నానా అవస్థలు పడుతూ చదువుకు దూరమయ్యే పరిస్థితులుంటే, మరోవైపు నిర్మాణం పూర్తయి, నాలుగున్నరేళ్ళ కావస్తున్నా బాలికల హాస్టల్ భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో దీన్ని బాలికల హాస్టల్‌గా కాకుండా, మండల విద్యాశాఖ కార్యాలయానికి వచ్చే విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, ఇతరత్రా సరంజామా నిల్వ ఉంచుకునే గొడౌన్‌గా మార్చేశారు.

నిర్మాణం పూర్తయి, ఏళ్లతరబడి వినియోగంలో లేకపోవడంతో హాస్టల్ భవనం ద్వారాలు, తలుపులు, కిటికీలు, విద్యుత్ బోర్డులు శిథిలమైపోతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా వసతి గృహాన్ని వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులపై పని భారం

-200 మంది కార్మికులు ఉండాల్సి ఉండగా 80 మందితో పనులు

-పని చేయని పనిముట్లు-రోడ్డెక్కని ఈ - వాహనాలు

మరమ్మతుకు నోచని వాహనాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పలు సమస్యలతో పారిశుధ్య కార్మికులు సతమతం అవుతున్నారు. లక్ష మంది జనాభాకు పైగా ఉన్న మున్సిపాలిటీలో 96 మంది కాంట్రాక్ట్ వర్కర్స్, 17 మంది పర్మినెంట్ వర్కర్స్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. సిబ్బంది కొరతతో పాటు పారిశుధ్య పనిముట్లు పాడై సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అతీగతి లేకుండా పోయింది.

మున్సిపాల్టీలో నాలుగు ట్రాక్టర్లు, 52 పుష్ కార్టులు ఉండగా, 30 పుష్ కార్టులు మూలన పడ్డాయి. వాస్తవానికి 10 మాత్రమే పని చేస్తున్నట్లు తెలిసింది. వీటితోనే మున్సిపల్ కార్మికులు పారిశుధ్య పనులు నెట్టుకొస్తున్నారు. వీధుల్లోకి వెళ్లాల్సిన ట్రాక్టర్లను పాయింట్లకు దూరంగానే పెట్టి పుష్ కార్టులతో తడి చెత్త పొడి చెత్తను ట్రాక్టర్ వద్దకు కార్మికులే తీసుకుని వెళ్లాల్సి వస్తుంది.

సుమారు 200 మంది కార్మికులు కావలసి ఉండగా కేవలం 80 మందితో పని చేయిస్తున్నారు. సంవత్సరానికి పన్నుల రూపంలో ఐదు కోట్ల రూపాయల వరకు వసూలు అవుతుంది. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడలేదని మున్సిపల్ సమావేశాల్లో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు వాదిస్తున్న విషయం తెలిసిందే. విద్యుత్ దీపాల పేరుతో కొన్ని లక్షల రూపాయలు కాజేశారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి కౌన్సిలర్ పద్మావతి పలుసార్లు ఆరోపించిన విషయం విధితమే. పనిముట్లు పాడైనప్పుడు సాధారణ రిపేర్లు సైతం కార్మికులే భరించాల్సి వస్తుంది. ఔట్సోర్సింగ్ కార్మికులపై ఈ భారాన్ని నెట్టివేస్తున్నారు. తప్పని పరిస్థితిలో కార్మికులు రిపేర్లు చేయించుకుని ఉపయోగించాల్సి వస్తోంది. పనిముట్లు పనిచేయలేదని అధికారుల దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినప్పటికీ ఇటు పాలకమండలి, అటు అధికారులు పట్టించుకోలేదు.

నర్సీపట్నం మున్సిపాలిటీకి స్వచ్ఛ కార్పోరేషన్ ద్వారా 10 ఈ వాహనాలు మంజూరయ్యాయి. వీటిని అట్టహాసంగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ వాహనాలు రోడ్డు ఎక్కలేదు. రిజిస్ట్రేషన్ అనుమతులు లేక ఇంకా వీటిని ఉపయోగించలేదని అధికారులు తెలిపారు. ఇందులోను నాలుగు వాహనాలు వాడకుండానే పాడైపోయాయని తెలిసింది.

ఈ విషయమై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎన్ వి ఎస్ ఎస్.సత్యనారాయణను వివరణ కోరగా పనిముట్లు ఏవి సమకూర్చాలో నా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే సమకూర్చేందుకు కృషి చేస్తాను.

కార్మికులను నియమించాలి

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జనాభా ప్రాతిపదికన కార్మికులను నియమించాలి.కావలసిన పనిముట్లు కొనుగోలు చేయాలి. శానిటేషన్‌పై నిర్లక్ష్యం చేసినట్లయితే ప్రజలు అనారోగ్య పాలవుతారు. ఈ విషయాలను పాలకమండలి పట్టించుకోవాలి.పనిముట్లు రిపేర్లు అధికారులు చేయించాలి. ఈ భారాన్ని కార్మికులపై నెట్టకూడదు.

అడిగర్ల రాజు
సిఐటియు జిల్లా అధ్యక్షులు

పెరిగిన పని భారం

జనాభాకు తగినట్లుగా పారిశుధ్య కార్మికులు లేక పోవడంతో తీవ్రమైన పని భారం పండింది. పనిముట్లు సరిపడా ఇవ్వ లేదు. లక్షలు రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన యంత్రాలు, వాహనాలు మరమ్మతుకు గురై మూలన పడ్డాయి. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. వాహనాలు లేకుండా పనులు ఎలా చేయాలి.

బొర్రా శ్రీను
మున్సిపల్ కార్మికుల ప్రెసిడెంట్

అరకొర సౌకర్యాలతో..

జగనన్న గృహాలు నిర్మించేదెలా?

ప్రజాశక్తి-రోలుగుంట:రాష్ట్రంలో ప్రతీ పేదవానికి ఇల్లు ఉండాలని ప్రభుత్వం సంకల్పించినా జగనన్న కాలనీల నిర్మాణం సగంలోనే నిలిచి పోయాయి. మండలంలో పలు గ్రామాల్లో, మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో మంజూరైన కాలనీలో సగం కూడా పూర్తి కాలేదు.

మండలానికి జగనన్న కాలనీల లేఅవుట్ ఇళ్ల 552 మంజూరయ్యాయి. అర్ల పంచాయతీ శివారు లోసింగి గ్రామానికి 41 ఇళ్లు మంజూరయ్యాయి. ఆ గ్రామ కొండ మీద ఉండటం, సరైన రహదారి లేక పోవడం, షెడ్యూల్ తెగలకు చెందిన వారు మెటీరియల్ అందుబాటులో లేక పోవడంతో లబ్ధిదారులు ప్రారంభించలేదు.

కంచుగుమ్మల, అడ్డసరం, గుండుబాడు పంచాయతీ పరిధిలో అనుకూలంగా ఉన్న చోట స్థలం మంజూరు చేయకపోవడంతో వారు ప్రారంభించ లేదు.మండల కేంద్రమైన రోలుగుంట గ్రామస్థులకు మూడు చోట్ల స్థలాలు పంపిణీ చేశారు. కొండపాలెం గ్రామస్థులతో కొమరవోలు వెళ్లే రహదారిలో 17 మందికి, కొండను ఆనుకొని పాత స్టోన్ క్రషర్ వద్ద 30 మందికి, గౌరమ్మ కోనేరు దిగువ భాగాన 9 మందికి స్థలాలు పంపిణీ చేశారు. పాత స్టోన్ క్రషర్ వద్ద ఉన్న 30 మందికి

మోటారు లేని బోరు

అధ్వాన్నంగా ఉన్న జగనన్న కాలనీ ప్రదేశం

నిర్మాణం చేపట్టుటకు స్థానిక వైసిపి నాయకులు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదిర్చారు. ఆయన 30 మందిలో కొంత మందికి పునాది వేయించాడు. ఒక సంవత్సరం పాటు ఇబ్బందులు పెట్టి చేతులెత్తేశాడు. దీంతో లబ్ధిదారులు కొందరు మళ్లీ పునాదులు నిర్మించుకు తన్నారు. ప్రారంభం లోనే సొంతంగా నిర్మించు కుంటే ఈ పాటికే నిర్మాణం పూర్తి చేసుకుండేవారమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పునాది స్థాయిలో ఉన్న ఇల్లు

గౌరమ్మ కోనేరు వద్ద స్థలాలు ఇచ్చిన వారు ఒక్కరు కూడా ప్రారంభించలేదు. ఈ స్థలానికి వెళ్లటానికి మెటీరియల్ తీసుకువెళ్లటానికి, రహదారి లేదని ఒక వేళ నిర్మించినా చెరువు కింద కట్టడాలు కడితే ఎప్పుడు ఏమౌతుందోనని ఆందోళన కూడా వారికి తోడయింది.

మిగతా గ్రామాల్లో కట్టడాలు ప్రారంభించినా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కుసర్లపూడి గ్రామంలో మెట్టపై స్థలాలు పంపిణీ చేయగా వారికి రహదారి సదుపాయాలు లేక ఇసుక, సిమెంట్, పిక్క వంటివి చేర్చడంలో అనేక ఇబ్బందులు పడ్డారు. ఉన్న స్థిరాస్తులు అమ్ముకొని గూడు నిర్మించుకున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సర్పంచ్, వైసిపి మండలాధ్యక్షులు మద్దు అప్పలనాయుడు మండల సర్వసభ్య సమావేశంలో ప్రతిసారి మొత్తుకున్నా మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

జనసేన క్రియాశీలక సభ్యత్వం

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్ ఛార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆదివారం సూర్యచంద్ర మాట్లాడుతూ, కార్యకర్తలకు 5 లక్షల భీమా సౌకర్యం అందిస్తారన్నారు. 500 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5లక్షల భీమా కుటుంబ సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే రూ.50వేలు ప్రమాద భీమాతో పాటు ఎక్కడైనా వైద్య సేవలు అందుకునే వెసులుబాటుతో పాటు ఆరోగ్య భీమా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చెట్టుపల్లి ఉప సర్పంచ్ పరవాడ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కలిమి శ్రీను, తెలపాక కృష్ణ, కరణం ఈశ్వరరావు, ప్రోగ్రాం కమిటీ మెంబర్లు కొత్తకోట రామశేఖర్, పినపోతుల నాగు పాల్గొన్నారు.

జర్నలిస్టు వెంకటరమణ మృతి

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో ఆంధ్రా వాయిస్ దినపత్రికలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టు నల్లల వెంకట రమణ ఆకస్మికంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం వెంకటరమణ కుమారుడు మధు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి పది గంటల సమయంలో వెంకటరమణ అనారోగ్యానికి గురి కావడంతో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఏపిడబ్ల్యుజెఎఫ్ యూనియన్ ప్రారంభంలో కీలకపాత్ర పోషించిన రమణ మృతి పట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి ఈశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు పినపాత్రుని రామం, కార్యదర్శి కీర్తి కన్నబాబు, సీనియర్ జర్నలిస్టు ముత్తా గోవిందరావు, మొల్లేటి లక్ష్మీకుమారి, శ్రీనువాసరావు శేఖర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి ఎన్.రాజుబాబు ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాజరై పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం వంటివి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతున్న విద్యార్థులు

దుర్గమ్మకు లక్ష గాజుల అలంకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గా మల్లేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేశారు. దేవాలయంలో ఉదయం నుంచి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. ఆదివారం ఉదయం మేజర్ పంచాయతీ దార్లపూడి వరహానది నుండి అడ్డరోడ్డు, నక్కపల్లి తదితర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పరహావదిలో అక్రమ తవ్వకాలు చేసి ట్రైర్ బళ్ళ ద్వారా తరలిస్తున్నారు. అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

తరలిస్తున్న ఇసుక

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:గసభ పంచాయతీ ముద్రిగుడ గ్రామంలో ప్రత్యేక వైద్య నిపుణులతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. డయేరియాతో అరకువేలి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాంగి కొత్తును పరామర్శించిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్వీ. పోతురాజు, ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, వార్డుమెంబర్ పి.సత్యనారాయణ పరామర్శించారు.

అవార్డు అందుకుంటున్న శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్‌కుమార్, వేణుగోపాల్, అప్పలరాజు

శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌కు లోటస్ అవార్డు

ప్రజాశక్తి-గాజువాక : సమాజ సమగ్ర అభివృద్ధి కోసం మెరుగైన సేవలందించేందుకు కృషి చేసిన నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌కు 2023 సంవత్సరానికి లోటస్ అవార్డును విజన్ 2020 ప్రదానం చేసింది. ఈ అవార్డుతో పాటు రూ.50 వేలు నగదు బహుమతిని మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లోని గోమాబాయ్ నేత్రాలయలో జరిగిన 17వ వార్షిక సదస్సులో విజన్ 2020-ద రైట్ టు సైట్ ఇండియా సీఈఓ డాక్టర్ ఫణీంద్రబాబు నుకెళ్ల ఆదివారం అందజేశారు. అవార్డును శంకర్ ఫౌండేషన్ తరపున డిజిఎం వి.రమేష్‌కుమార్, ఎజిఎం కెవి.వేణుగోపాల్, సీనియర్ మేనేజర్ అప్పలరాజు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విజన్-2020 అధ్యక్షుడు ఆర్ఎన్ మొహంతి పాల్గొన్నారు. కమ్యూనిటీ ఆప్తాల్మాలజీ విభాగంలో శంకర్ ఫౌండేషన్‌కు ఈ అవార్డు లభించింది. శంకర్ ఫౌండేషన్ సమిష్టికృషిని ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఎ.విజయ్‌కుమార్, ఎ.కృష్ణకుమార్ అభినందించారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో కొత్త పైపులైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 628వ రోజుకు చేరింది. ఆందోళన శిబిరం వద్ద ఆదివారం మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కంపెనీ నుండి వెలువడే వాసనకు ముక్కు మూసుకుని నిరసన తెలిపారు. కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, పిక్కి ఏడుకొండలు, చేపల సోమేష్, దైలపల్లి శ్రీను, పిక్కి గంగరాజు , బొంది నూకరాజు, మైలపల్లి బాబ్జి, కొత్వాల కాశి, కారే కొదండరావు, పిక్కి రమణ తదితరులు పాల్గొన్నారు.

జిసిసి డ్రైవర్లకు జీతాల పెంపు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

గిరిజన సహకార సంస్థ (జిసిసి) ద్వారా రేషన్, నిత్యావసర సరుకులను గిరిజనులకు పంపిణీ చేస్తున్న డ్రైవర్ల జీతాలను పెంచినట్టు జిసిసి ఛైర్‌పర్సన్ స్వాతిరాణి మీడియాకు తెలిపారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వాలని డ్రైవర్లు చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. వారి సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా జీతాల పెంపుదలకు ఆయన ఆమోదం తెలిపారన్నారు. ఇప్పటి వరకూ రూ.15 వేలు తీసుకుంటున్న వారికి రూ.20,800 అందేలా చర్యలు తీసుకొని, 55 మంది డ్రైవర్ల కుటుంబాలకు న్యాయం చేశామన్నారు.

భెల్ గుర్తింపు ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి- గాజువాక : గాజువాకలోని భెల్ యూనిట్‌లో ఈ నెల 31వ తేదీన జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను గెలిపించాలని గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.బాబూరావు పిలుపునిచ్చారు. గుర్తింపు యూనియన్ కార్యాలయం వద్ద ఆదివారం ఎన్నికల బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, కార్మిక సమస్యలపై యాజమాన్యంతో పోరాటం చేసే అనుభవం తమ ప్యానల్ కు ఉందన్నారు. యునైటెడ్ ఫ్రంట్ ప్యానల్‌కు ఎటువంటి అనుభవము లేని నాయకత్వం ఉందని తెలిపారు. అధ్యక్షులుగా పోటీ చేస్తున్న జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, కార్మిక సమస్యలపై అనుభవంతో పాటు పోరాడే శక్తి ఉన్న తమ ప్యానల్‌ను గెలిపించేందుకు సూర్యుడి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఐఎన్‌టియుసి నాయకులు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపులో ఉన్న ఏఐటియుసి కార్మికులకు ఎటువంటి సేవ చేయలేదన్నారు. సిఐటియు జిల్లా నాయకులు, ఎస్.జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోట్లాడే శక్తి, అనుభవం ఈ ప్యానల్‌కు ఉందన్నారు. వైఎస్ఆర్‌టియుసి నాయకులు మస్తానప్ప మాట్లాడుతూ, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఈ కంపెనీ రక్షించబడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎఐసిటియు నాయకులు పట్నాయక్, ఐఎన్‌టియుసి నాయకులు నాగభూషణం, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఏసిఏ పనితీరు అద్భుతం

-ఏపిఎల్ యువ క్రికెటర్లకు మంచి వేదిక
-మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పనితీరు అద్భుతంగా ఉందని 1986 ప్రపంచ కప్ హీరో, ఇండియా మాజీ టెస్ట్ కెప్టెన్, బిసిసిఐ మాజీ సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసించారు. ఆదివారం డాక్టర్ వైఎస్ఆర్ ఏసిఏ - విడిసిఏ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి, అంతర్జాతీయ ప్లేయర్ కెఎస్.భరత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆంధ్రలో ప్రతిభ ఉన్న క్రికెటర్లు చాలా మంది ఉన్నారని, అలాంటి వారి ప్రోత్సాహం కోసం ఏపిఎల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్ర నుంచి మరింత మందిని దేశానికి ప్రాతనిధ్యం వహించే క్రికెటర్లను తయారు చేయాలని కోరారు. యువ క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఏపిఎల్ మంచి వేదికని తెలిపారు. క్రీడాకారుల్లో నైపణ్యాభివృద్ధి కోసం వైజాగ్ స్టేడియాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అభినందించారు. తాను ఇంజినీరింగ్ చదివి క్రికెటర్‌ను అయ్యాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏసిఏ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు పి.రోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1991-92 లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదిక గా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు.ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి గురువులు శర్మ, నాగలక్ష్మి, పివీఎస్ ఆచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్ బాబు, వెంకట ప్రకాష్ రావు, రవిబాబు, సూర్య ప్రకాష్ రావు, రమేష్, కనక రెడ్డి, సత్యనారాయణ, శంకర్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అనిల్ కుమార్, బాబురావు ,గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు

జలాశయాల మరమ్మతు పనులు చేపట్టాలి

మాట్లాడుతున్న రామా నాయుడు

ప్రజాశక్తి -మాడుగుల: పెండింగ్ జలాశయాలు పూర్తి చేసి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మాడుగులలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. తాచేరు, గొర్రె గెడ్డ, పెద్దేరు ఎడమ కాలువల కోసం తాము నిధులు మంజూరు చేస్తే, ప్రభుత్వం పనులు చేపట్టలేదన్నారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు ఏనాడూ రైతు సమస్యల ప్రస్తావన తీసుకు రాలేదని విమర్శించారు. ఇసుక మాఫియా పెరిగిందని, రహదారుల పరిస్థితి అధ్వానంగా వుందని అన్నారు .రైతుల సమస్యలు పక్కన పెట్టి దోపిడీలకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. తాచేరు జలాశయం కోసం ఈనెల 29, 30 తేదీలలో మండలంలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాద యాత్ర చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుప్పాల అప్పలరాజు, మజ్జి తాత బాబు,అప్పాన రమణ, పుప్పాల రమేష్, గొల్లవిల్లి శ్రీరామమూర్తి, పుప్పాల రమేష్, లెక్కల కాశి బాబు, సూర్యనారాయణ రాజు, బుద్దాల రమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా పురస్కారాలకు నగర ప్రముఖులు ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 29న విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా పలువురు ప్రముఖులకు ఇస్తున్న భాషా పురస్కారాలకు నగరానికి చెందిన శ్రీ మాతా కళా పీఠం నిర్వాహకులు భిన్నాల నరసింహమూర్తి, పల్లి నాగభూషణరావులు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిద్దరికీ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు నుంచి ఆహ్వానాలు అందాయి. నగరంలోని మధురా నగర్‌కు చెందిన వీరిద్దరూ ఉత్తరాంధ్ర కళలను, కళాకారులను, తెలుగు భాషను, కవులను కొన్ని దశాబ్దాలుగా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఎన్నో పాటలను ఆడియో రూపంలో విడుదల చేశారు. వందలాది జానపద, పౌరాణిక కళారూపాలు, వేలాది తెలుగు భక్తి, జానపద గీతాలు అందించారు. పల్లి నాగభూషణరావు రచయిత, స్వరకర్త, గాయకుడు, నటునిగా ప్రసిద్ధి చెందారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తపరిచారు.

పేదలకు చేయూతనిస్తాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెడ్డిల్లోని పేదవారికి విద్య, ఉపాధి అంశాల్లో చేయూతనిస్తామని రెడ్డి సంయుక్త కార్యాచరణ కమిటీ నూతన అధ్యక్షులు విప్పల శివకుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన నూతన అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేదలకు విద్య, ఉపాధి అంశాలలో చేయూతనివ్వడానికి రెడ్డి జెఎసి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. రెడ్డి సంఘాలన్నింటినీ ఏకం చేస్తూ సేవలందించే దిశగా కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జెఎసి గౌరవ అధ్యక్షులు పొలిమేర వెంకటరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు నవల్గ సత్యనారాయణరెడ్డి, జాతీయ అధ్యక్షులు మారం బాలబ్రహ్మారెడ్డి, ఒసి సంఘం జాతీయ అధ్యక్షులు జి.కరుణాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, ఆచార్య తిమ్మారెడ్డి, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇసి మెంబర్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. రెడ్డి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.శేషాద్రి రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షులుగా సరోజినీ రెడ్డి, ప్రధాన మహిళా కార్యదర్శిగా సుజాతరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

క్రికెటర్ రవణి ఇంట సంబరాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని మెరిక చింత పంచాయతీ రంగసింగపాడు గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన వలసనైని రవణి ఇంట సందడి నెలకొంది.బాలకృష్ణ, చిట్టమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. రెండవ కుమార్తె రవణి అంధురాలు. ఈమె చిన్నతనం నుంచి క్రీడా రంగంలో మక్కువ చూపించడంతో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అంతర్జాతీయ క్రికెట్లో ఆస్ట్రేలియా పై భారత్ ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన రవణి గెలుపుకు కారణమైంది.దీంతో, పలువురు ఆమెను అభినందించి ప్రశంసించారు. స్వగ్రామంలో ఆమె ఇంట అంగరంగ వైభవంగా సంబరాలు చేశారు. మిఠాయిలు ఒకరికొకరు తినిపించు కున్నారు.